సాక్షి
సూర్యాపేట
శనివారం । 7 । జనవరి । 2023



వటపత్రశాయిగా నృసింహుడు
యాదాద్రిలో అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం శ్రీస్వామి వారు వటపత్రశాయిగా దర్శనమిచ్చారు. - 8లో



ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు
నందికొండలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. - 8లో

గరిష్టం/కనిష్టం
30.0°/14.0°

వాతావరణం
ఉదయం ఆకాశం పొగమంచుతో మేగావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కెరీర్ గైడెన్స్‌పై నేడు సెమినార్

సూర్యాపేట టౌన్: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7 (శనివారం) దురాజ్‌పల్లిలోని ఎంఎస్‌ఆర్ సెంట్రల్ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కు ముఖ్యవక్తగా ఎన్‌ఐటీ వరంగల్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేయనున్నట్టు పేర్కొన్నారు.

వేగంగా 'మోడల్' పనులు



నారాయణపురం పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ అశోక్

చిలుకూరు: జిల్లా వ్యాప్తంగా మన ఊరు–మన బడి పథకం కింద మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసిన స్కూళ్లలో అదనపు గదుల నిర్మాణ పనులు వేగవంతం చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం, రామాపురం ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న గదుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలానికి రెండు పాఠశాలలు మోడల్‌గా ఎంపిక చేశామని, వాటిల్లో చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ సలీమ్ షరీఫ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యలగొండ శ్రీనివాస్, వసంత, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నిబంధనలు తొలగించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన కఠిన నిబంధనలను తొలగించి, పరుగు పందెంలో అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్ రాసే అవకాశం కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ ప్రిలిమ్స్‌లో తప్పుగా వచ్చిన ఏడు ప్రశ్నలకు న్యాయస్థానం ఆదేశానుసారంగా మార్కులను కలిపి అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని నిబంధనలు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామకాల్లో పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. పాత పద్ధతిలో నియామకాలు చేపట్టాలని అభ్యర్థులు కోరుతున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పిడమర్తి భరత్, వంశీ, డి.శివ, బి.వినోద్, బి.రాంచరణ్, ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, హోమం, ప్రత్యేక పూజలు అర్చనలు, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం కళ్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మధుపర్కపూజ మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ఎడమ కాల్వకు గండి ముప్పు



కోతకు గురైన ఎడమ కాల్వ కట్ట

పెన్‌పహాడ్: మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి వద్ద నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు గండి ముప్పు పొంచి ఉంది. కాల్వ కట్ట కోతకు గురై వారం రోజులుగా ప్రమాదకరంగా కనిపిస్తోంది. దీంతో కాల్వ పక్కన వరి పొలాలు సాగు చేసిన రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు అప్రమత్తమై కాల్వకు గండిపడక ముందుకే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.3వేల కోట్లతో అభివృద్ధి

- సాగునీటి రంగానికి రూ.2వేల కోట్లు.. ఇతర పనులకు రూ.వెయ్యి కోట్లు
- మేళ్లచెరువు మహాశివరాత్రి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు కృషి
- జాన్‌పహాడ్ దర్గాను జహంగీర్‌పీర్ దర్గాలాగా అభివృద్ధి చేస్తాం
- హుజూర్‌నగర్ బహిరంగ సభలో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్



హుజూర్‌నగర్ సభలో ప్రసంగిస్తున్న కేటీఆర్, చిత్రంలో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తదితరులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ విజయోత్సవ సభలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని, నియోజకవర్గంలో దాదాపు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, ఎమ్మెలే క్యాంప్ కార్యాలయం, సబ్ ట్రెజరీని ఆయన ప్రారంభించారు. తర్వాత వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. నియోజకవర్గంలో కొత్త లిఫ్టులు ఏర్పాటు చేయడంతోపాటు పాతవి, సాగర్ కాల్వల మరమ్మతులకు రూ.2వేల కోట్లు మంజూరు చేసింది కేసీఆర్ ప్రభుత్వమని, అని మంజూరు చేయించిన నాయకుడు ఎమ్మెల్యే సైదిరెడ్డిని చెప్పారు. రెవెన్యూ డివిజన్ కలను నెరవేర్చామన్నారు. ఈ ప్రాంత కార్మికుల కోసం ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేశామని, పూర్తి స్థాయి ఈఎస్‌ఐ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ అదనపు జిల్లా న్యాయస్థానం మంజూరైందని, దీన్ని త్వరలోనే న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. గిరిజనుల కోసం బంజారాభవన్ నిర్మించుకున్నామని చెప్పారు. పట్టణంలోని సీతారామస్వామి గట్టు వద్ద ఉన్న సింగిల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.30 కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు. రూ.60 కోట్లతో 2,160 ఇళ్లను పూర్తి చేసి పట్టణంలో ఇళ్లు లేనివారి అందజేస్తామని చెప్పారు. మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ హామీ మేరకు నిధులు..

సీఎం కేసీఆర్ హామీ మేరకు హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, నేరేడుచర్లకు రూ.15 కోట్లు, మండల కేంద్రాలకు రూ.30 లక్షల చొప్పున మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలోని ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున 134 గ్రామ పంచాయతీలకు రూ.26.80 కోట్లు ఇచ్చామని గుర్తు చేశారు. అలాగే మూసీనదిపై 7 చెక్ డ్యాంలకు రూ.27 కోట్లు, కేజీబీవీ భవనాల నిర్మాణానికి రూ.7 కోట్లు, పట్టణంలో మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి రూ.8.40 కోట్లు, ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి రూ.6.30 కోట్లు అన్ని కలిపి రూ.123 కోట్లు, ఆర్‌అండ్ నిధులు రూ.50 కోట్లు, పంచాయతీ రాజ్ నుంచి అన్ని కలిపి ఏడాదికి రూ.వెయ్యి కోట్ల చొప్పున మూడేళ్లలో రూ.3వేల కోట్లలతో అభివృద్ధి పనులు చేయిస్తున్న ఎమ్మెల్యేకు చప్పట్లతో స్వాగతం పలకాలని కేటీఆర్ అన్నారు. హుజూర్‌నగర్‌కు మరో రూ.20 కోట్లు, నేరేడుచర్లకు రూ.10 కోట్లు, మున్సిపల్ బిల్డింగ్‌కు రూ.3 కోట్లు, ఇండోర్ స్టేడియాలకు కలిపి దాదాపు రూ.35 కోట్లు కావాలని అడిగారని.. వాటన్నిటినీ మంజూరు చేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. మేళ్లచెరువు మహాశివరాత్రి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇక్కడ జరిగే ఎద్దుల పందేలు చూసేందుకు వస్తానన్నారు. జాన్‌పహాడ్ దర్గాను జహంగీర్ పీర్ దర్గాలాగా అభివృద్ధి చేస్తామని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగులు లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు కాసోజు శంకరమ్మ, వైవీ, శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు గెల్లి అర్చనరవి, సీహెచ్.జయబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు



సభకు హాజరైన జనం

రూ.200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా ఉదయం 11.30గంటలకు హెలి పాడ్ నుంచి వచ్చి స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న నూతన ఎస్టీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. రామస్వామి గట్టు వద్ద గల 1బీహెచ్‌కే భవనాల సముదాయాన్ని మంత్రులు పరిశీలించారు. మిగిలిన పనులకు ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించిందని, ఆర్‌అండ్ బీ అధికారులు త్వరగా పనులు పూర్తి చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. అనంతరం రూ.కోటి నిధులతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు రూ.20 కోట్లతో చేపట్టనున్న కీతవారిగూడెం, వెలిదండ మునగాల రహదారి విస్తరణ పనులు, రూ.6 కోట్లతో నిర్మించనున్న హుజూర్‌నగర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు, అలాగే రూ.10 కోట్లతో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు, రూ.39 కోట్లతో చేపట్టే నేరేడుచర్ల, ముగ్దుమ్ నగర్, మాధవరాయిని గూడెం బస్తీద వాఖా నాలకు, రూ.2 కోట్లతో గరిడేపల్లి ఎస్సెస్పీఎడమ కాలువ వంతెన నిర్మాణ పనులకు, అలాగే నీటి పారుదల ఆయకట్టు నిర్మాణానికి రూ.1.37 కోట్లు, రూ.50 లక్షలతో ముక్త్యాలా బ్రాంచ్ కెనాల్ వంతెన నిర్మాణానికి అలాగే రూ.18 లక్షలతో రామాపురం, వేపల సింగారం వంతెన నిర్మాణానికి మంత్రులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, రాజ్యసభ ఎంపీతోపాటు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల్లో చిరునవ్వే లక్ష్యం

- చండూరు సభలో కేటీఆర్

చండూరు : రాష్ట్రంలో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పురపాక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో పర్యటన అనంతరం నల్లగొండ జిల్లా చండూరు వచ్చిన ఆయన.. జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు చండూరు నుంచి కొండమల్లేపల్లి వరకు గల రోడ్డును రూ.90 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తూ.. ఆరాతీస్తూ..

- కొనసాగుతున్న ఆపరేషన్ స్మైల్–9
- పని ప్రదేశాల్లో బాల కార్మికులను గుర్తిస్తున్న అధికారులు
- ఈ నెలాఖరు వరకు కార్యక్రమం
- చిన్నారుల మోములో చిరునవ్వే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు



పని ప్రదేశంలో బాల కార్మికుడిని గుర్తించిన అధికారులు

గుర్తించిన చిన్నారుల వివరాలు..

సంవత్సరం	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్	మొత్తం
2017	203	123	326
2018	81	81	162
2019	39	35	74
2020	42	00(కరోనా)	42
2021	76	78	154
2022	79	142	221

నాగారం: బందీగా మారిన బాల్యాన్ని స్వేచ్ఛ వైపు నడిపిస్తూ, చిన్నారుల మోములో చిరునవ్వే లక్ష్యంగా ప్రభుత్వం ఆరేళ్ల నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. అయినా బాల కార్మికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణ అధికారులు ఈ నెల 1నుంచి చేపట్టిన ఆపరేషన్ స్మైల్–9 కార్యక్రమంలో వివిధ చోట్ల తనిఖీలు చేస్తూ.. బాల కార్మికులు ఉన్నారా లేరా అని ఆరా తీస్తున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు బాల కార్మికులు పనిచేసే హోటళ్లు, మెకానిక్ షెడ్లు, కర్మాగారాలు, ఇటుక బట్టీలు, వ్యవసాయ రంగ పనుల్లో ఉన్న బాల కార్మికులను గుర్తించేందుకు జిల్లాలో రెండు బృందాలతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ బృందాల్లో పోలీసులు, బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ), కార్మిక, చైల్డ్‌లైన్, విద్య, వైద్యశాఖ అధికారులు ఉన్నారు.

14 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే..

వివిధ చోట్లలో గుర్తించిన వారిలో 14 ఏళ్లలోపు పిల్లలు బాల కార్మికులుగా పనులు చేస్తుంటే బాధ్యులపై కార్మిక శాఖ బాండెడ్ లేబర్ చట్టం, 15–18 ఏళ్ల మధ్యవారు ఉంటే ప్రొబేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేస్తారు. గుర్తించిన పిల్లల వయస్సు ఆధారంగా వారి భవితకు దిశానిర్దేశం చేస్తారు. నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితుల కారణంగా పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. ఇలాంటి వారికి అవగాహన కల్పిస్తారు.

1098కి సమాచారం ఇవ్వండి



మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి అదే పాఠశాలలో చేర్పిస్తాం. పనుల్లో ఉన్నవారిని సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి వయస్సు ఆధారంగా అవసరమైన చోటుకు పంపిస్తాం. బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం. బడీడు పిల్ల లు ఎక్కడున్నా 1098కి సమాచారం అందించాలి.

– జ్యోతిపద్మ, డీడబ్ల్యూఓ, సూర్యాపేట

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



మెకానిక్ షాపులు, దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, ఇటుక బట్టీల వద్ద బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బాల కార్మికులను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నాం.

– బి.రవికుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సూర్యాపేట

ఆరేళ్లలో 979 మందికి విముక్తి

జిల్లాలో 2017 నుంచి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనవరిలో నిర్వహించే ఆపరేషన్ స్మైల్, జూలైలో నిర్వహించే ముస్కాల ద్వారా గడిచిన ఆరేళ్లలో జిల్లా వ్యాప్తంగా 979 మందికి విముక్తి కలిగించారు. వీరిలో 806 మంది బాలురు, 173 మంది బాలికలను గుర్తించారు. బాలురతో పని చేయించుకునే అవకాశం ఉండటంతో వారే ఎక్కువగా పనుల్లో మగ్గుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే కొందరు యజమానులు దాడులు జరిగిన సమయంలో వదిలేసి తర్వాత పనుల్లో పెట్టుకున్నారని ఆరోపణలున్నాయి.

కిలో టమాట రెండు రూపాయలే !



మార్కెట్‌కు టమాటాలు తెచ్చిన రైతు



తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నెల్లిబండతండాలో 30 మంది రైతులు 50 ఎకరాల్లో టమాట సాగు చేశారు. రోజూ టమాటాలు తెంపి మార్కెట్లో హోల్‌సేల్‌గా అమ్ముతారు. గతంలో 25 కిలోల బాక్స్ రూ.300 నుంచి రూ.500 వరకు అమ్మేవారు. ప్రస్తుతం 25 కిలోల బాక్సు ధర కేవలం రూ.50 పలుకుతుంది. రోజూ టమాటాలు తెంపడానికి ఒక్కో కూలీకి రూ.300 ఇవ్వాల్సి వస్తుండంతో కూలీల ఖర్చు కూడా పూడని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొందరు రైతులు టమాటాలను ఏరకుండానే చేలల్లోనే వదిలేస్తున్నారు. మరికొందరు పశువులను మేపుతున్నారు. ఈ సారి జిల్లాలో టమాట అధిక దిగుబడి రావడంతో అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.

రైతులకు చెల్లిస్తున్న ధర ఇంతే..


- 25 కిలోల బాక్సు కేవలం రూ.50కే..
- ఒకేసారి అధిక దిగుబడి రావడమే కారణం
- కూలీల ఖర్చు కూడా పూడని దైన్యం
- ఏరకుండా చేలల్లోనే వదిలేస్తున్న రైతులు

తిరుమలగిరి(తుంగతుర్తి): టమాట లేని కూరలు ఉండవు. గతంలో టమాట కిలో రూ.50 నుంచి రూ.80 వరకు పెట్టి కొనుగోలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ప్రస్తుత సమయంలో పంట దిగుబడి అధికంగా రావడంతో రేటు పాతాళానికి పడిపోయింది. మొన్నటి దాకా కిలో టమాట రూ.30 వరకు పలికినప్పటికీ ఇప్పుడు మాత్రం ఏకంగా రూ.2 నుంచి రూ.5 వరకే పలుకుతుంది. దీంతో టమాట పంట సాగు చేసిన రైతులు బోరుమంటున్నారు.

పదిహేను రోజుల క్రితం నుంచి..

టమాట పంటకు మార్కెట్‌లో సరైన ధర లేక రైతులు కుదేలవుతున్నారు. 15 రోజుల క్రితం వరకు మంచి ధర పలికినా ఆ తరువాత దారుణంగా పడి పోయింది. దీంతో పంట సాగు చేసిన అన్నదాతలు పెట్టుబడి రాక ఆర్థికంగా చితికి పోతున్నారు. జిల్లాలో 756 ఎకరాల్లో టమాట పంట సాగు చేశారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇప్పటి వరకు రూ.20 వేలు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా పూడేట్టులేదు



పదిహేను రోజులుగా టమాట ధర పూర్తిగా తగ్గి పోయింది. హోల్‌సేల్‌గా మార్కెట్‌లో 25కిలోల బాక్సు రూ.50లకే అమ్ముతున్నాం. కొన్ని సమయాల్లో వారాంతపు సంతల్లో కిలోకు రూ.5 చొప్పున అమ్ముతున్నాం. పెట్టుబడులు కూడా పూడని పరిస్థితి ఉంది.

– రాములు, రైతు, నెల్లిబండతండా, తిరుమలగిరి మున్సిపాలిటీ

20 గుంటల్లో సాగు చేశాను



టమాట పంట వేసిన రైతులు ఈసారి భారీగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో ధర పూర్తి గా పడిపోయింది. హోల్‌సేల్‌గా రూ.2లకే కిలో చొప్పున అమ్ముతున్నాం. పంట తెంపినా కూలీ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో టమాట తోట వదిలేశాను.

– శంకర్, రైతు, తిరుమలగిరి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ సంవత్సరం ఎకరంలో టమాట తోట వేశాను. రోజూ 40 నుంచి 50 బాక్సుల టమాట చేతికి వస్తుంది. కానీ ధర మాత్రం లేదు. కూలీలకు రోజూ రూ.1000 చెల్లిస్తున్నా. దీనికి తోడు మార్కెట్‌కు తరలించడానికి ఆటో కిరాయి రూ.500 వరకు అవుతుంది. ఏమి మిగులుబాటు కావడం లేదు.

– రమేష్, రైతు, నెల్లిబండతండా

బీజేపీ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



సమావేశమైన బీజేపీ నాయకులు

కోదాడ అర్బన్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో శనివారం బూత్ కార్యకర్తలతో వర్చువల్‌గా నిర్వహించే సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి కోరారు. శుక్రవారం కోదాడలో పార్టీ కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల సీతారామ ఫంక్షన్ హాల్‌లో బూత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో నియోజకవర్గ స్థాయిలో సమ్మేళనం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి చాడ శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నకిరేకంటి జగన్‌మోహన్‌రావు, సత్తుపల్లి ఇన్‌చార్జి కనగాల వెంకట్రామయ్య, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య, హనుమంతరావు, నూనె సులోచన, శ్రీనివాసరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

తుంగతుర్తి : చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.15లక్షల పరిహారం చెల్లించాలని తుంగతుర్తి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి కె.సురేష్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నర్ర కొండల్‌రావుకు సూర్యాపేట మండలం బాలెంలకు చెందిన గోదాల రంగారెడ్డి 2013లో రూ.12లక్షల చెక్కు ఇచ్చాడు. రంగారెడ్డి సకాలంలో సొమ్ము జమచేయకపోవడంతో బాధితుడు తుంగతుర్తిలోని జూనియర్ సివిల్‌కోర్టును ఆశ్రయించగా కోర్టు 2014లో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం చెక్ బౌన్స్ అయిన కారణంగా రంగారెడ్డికి ఏడా ది జైలు శిక్షతో పాటు రూ.15లక్షల పరి హారాన్ని కొండల్‌రావుకు మూడు నెలల్లోగా చెల్లించాలని కోర్టు తీర్పు వెల్లడించింది. డబ్బులు చెల్లించని ఎడల మరో ఆరు నెలల పాటు సాధారణ జైలు శిక్ష అమలవుతుందని తీర్పునిచ్చారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు



నిందితులను చూపుతున్న అధికారులు

నల్లగొండ క్రైం : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను టూటౌన్ పోలీస్‌లు అరెస్ట్ చేసి వారి నుంచి కిలోన్నర గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సోమిడి సంతోష్‌రెడ్డి, రాక్‌హిల్స్ కాలనీకి చెందిన మెడబోయిన చక్రి ఇద్దరు కలిసి విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి పట్టణంలో విక్రయిస్తున్నారు. దీంతో పోలీసులకు నమ్మదగిన సమాచారం అందడంతో వెతుకుతుండగా పోలీసులను చూసిన నిందితులు పారిపోయారు. దీంతో వారిని వెంబడించి పట్టుకుని, రెవెన్యూ అధికారుల సమక్షంలో గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం వారిని విచారించగా విద్యుత్‌నగర్‌కు చెందిన రాబిన్ అలియాస్ సాయి, వీటీ కాలనీకి చెందిన సంతోష్, సహజ్‌రెడ్డి, పద్మానగర్‌కు చెందిన సాయిగణేష్‌లతో కలిసి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు పట్టుబడిన నిందితులు వెల్లడించారు. మిగతా వారికోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలిపాలని ఆయన కోరారు.

వటపత్రశాయిగా నృసింహుడు

- రాత్రి పరమపదనాథుడిగా దర్శనమిచ్చిన యాదాద్రీశుడు
- నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు



వటపత్రశాయి అలంకార సేవ ముందు ప్రబంధ పారాయణం పఠిస్తున్న ఆచార్యులు



వైకుంఠనాథుడి అలంకార సేవలో శ్రీస్వామివారు

యాదగిరిగుట్ట : వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీస్వామి వారు ఉదయం భక్తులకు వటపత్రశాయిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రథమ ప్రాకార మండపంలో వటపత్రశాయి అలంకార సేవకు ఆచార్యులు హారతినిచ్చారు. అనంతరం సేవను ఆలయ తిరువీధుల్లో, మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ సేవలకు ముందు ఆచార్యులు, పారాయణికులు శాస్త్రోక్త పూజలతో, దివ్య ప్రబంధ పారాయణాలతో శ్రీస్వామిని కొలిచారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, జార్ఖండ్ శాసనసభ ప్రెస్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ఆనంద్ మోహన్, కమిటీ సభ్యులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, అశోక్‌కుమార్, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, ప్రధానార్చకులు, రుత్వికులు, పారాయణీకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాత్రికి పరమపదనాథుడిగా..

ఆలయంలో నిత్యారాధనల అనంతరం అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి శ్రీస్వామి వారిని పరమపదనాథుడిగా (వైకుంఠనాథుడిగా) అలంకరించి సేవోత్సవం చేపట్టారు. ప్రధానాలయంలో ద్రావిడ ప్రబంధ సేవాకాలంలో పారాయణిక స్వాములచే, అర్చక స్వాములచే అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దివ్య మనోహరంగా వైకుంఠనాథుడిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుత్ కాంతుల వెలుగులో శ్రీస్వామి వారు తిరువీధి సేవకు వెళ్లి భక్తులకు దర్శనం కల్పించారు.

నేటితో ఉత్సవాలు ముగింపు..

అధ్యయనోత్సవాలలో భాగంగా శనివారం శ్రీస్వామివారు శ్రీనరసింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో చివరి రోజు శ్రీనరసింహస్వామి అలంకార సేవతో ముగియనున్నట్లు ఆలయ ఆచార్యులు తెలిపారు.

పట్టువస్త్రాల బహూకరణకు అనుమతి ఇవ్వాలని వినతి



దేవస్థానం ఈఓ గీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణానికి పోచంపల్లి పట్టువస్త్రాల బహూకరణకు అనుమతి ఇవ్వాలని శుక్రవారం పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో దేవస్థానం ఈఓ గీతారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు ఈఓ స్పందించి మాట్లాడుతూ.. పోచంపల్లి ఇక్కత్‌పట్టు వస్త్రాలను అందజేసేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రత్యేక జీఓ జారీ చేసిందని తెలిపారు. ఇందుకు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, భోగ నర్సింహ, అంకం మురళి, భారత బాలరత్నం, కడవేరు చంద్రమౌళి, సంగెం చంద్రయ్య, వనం మల్లేశం, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : విద్యుత్ ఉద్యోగులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన యోగా, ప్రాణాయామంపై సూర్యాపేట డివిజన్ విద్యుత్ ఉద్యోగుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఈ పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం చేయాలన్నారు. నియమ నిబంధనలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

- మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగింత



అమన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ముస్లిం యువకులు

పెద్దవూర : మండల కేంద్రంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానిక ముస్లిం యువకులు చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎండీ.జానిమియా అలియాస్ పోస్ట్ జానీ, పలువురు ముస్లిం యువకులు మండల కేంద్రంలో నాలుగైదు నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని చేరదీశారు. రోజు అతడికి భోజనం పెడుతూ దగ్గరికి తీశారు. ఈ క్రమంలో అతడితో మాటల్లో మాటలు కలుపుతూ పేరు, ఊరు అడిగేవారు. ఒక రోజు తన పేరు అమన్ అని, మాది మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ అని చెప్పాడు. దీంతో జబల్‌పూర్‌కు చెందిన ఫోన్ నంబర్లను తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో అమన్ కుటుంబ సభ్యులు గురువారం రాత్రి పెద్దవూర వచ్చారు. అమన్ పరిస్థితిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. కుమారుడు అమన్ 8నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, అతడి కోసం వెతకని రోజు లేదని, కుమారుడు కనిపించలేదని తీవ్ర మానసిక వేదనతో అతడి తండ్రి సిరాజ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అమన్ ఆచూకీ తెలిపిన జానీమియాకు, ముస్లిం యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



అరుణను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి : భర్త వేధింపులు తాళ్లలేక ఇంటి నుంచి వెళ్లిన భార్య, ముగ్గురు పిల్లల మిస్సింగ్ కేసును శుక్రవారం స్థానిక పోలీసులు ఛేదించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గుర్రు నరేశ్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు నిత్యం మద్యం సేవించి వచ్చి భార్య అరుణను కొడుతున్నాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా భార్యాభర్తలు గొడవ పడ్డారు. భర్త వేధింపులు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురైన అరుణ గురువారం సాయంత్రం భర్త ఇంట్లో లేని సమయంలో తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం భర్త ఇంటికి వచ్చి చూసి వెతకగా భార్య, పిల్లలు కన్పించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో వారు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అరుణ చౌటుప్పల్ మండలం లక్కారం వద్ద పిల్లలతో ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం పోలీసులు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం భార్య భర్తలకు గొడవ పడకుండా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కేసును 24గంటల్లో ఛేదించిన ఏఎస్‌ఐ సైదిరెడ్డి, కానిస్టేబుల్ యాదగిరిని ఎస్‌ఐ అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న కేంద్రం

- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



మోత్కూరు : సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు : తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఛైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగానికి ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, పంట రుణాల మాఫీ, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో బీజేపీ ప్రభుత్వాలపై భారం పడుతుందని కేంద్రం భయపడుతుందన్నారు. పక్క రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ వస్తుందన్నారు. 9నెలల్లో ఎన్నికలు రావొచ్చని, రెండు, మూడు గ్రామాలకు కలిపి వన భోజనాల ద్వారా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని అన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బి.కమ్యాబ్‌చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.మేఘారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాంపాక నాగయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెడిపల్లి రఘుపతి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మల్లం అనిత, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు ఉన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషిచేయాలి

అడ్డగూడూరు : బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 8న మండలంలో చౌల్లరామారం శివారులో నిర్మించిన గిడ్డంగుల గోదాముల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, సోన్నాల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, నాయకులు తదతరులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

భూదాన్‌పోచంపల్లి : కాలనీభూములపై రైతుబంధు నగదు తీసుకుంటున్న పట్టణానికి చెందిన వెదిరె అరవిందారెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలో చేనేత కార్మిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వెదిరె అరవిందారెడ్డి తన తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన 433, 434, 435 సర్వేనంబర్లలో గల 28.17ఎకరాల భూమిని గతంలో ప్లాట్లు చేసి విక్రయించాడని, దీంతో అక్కడ రాంనగర్ కాలనీలు- ఫేజ్1, ఫేజ్-2 లు ఏర్పడి ప్రజలు చాలా ఏళ్లుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. అయితే ధరణి పోర్టల్‌లో అతడి పేరున భూమి చూపిస్తుండటంతో ఇప్పటి వరకు వెదిరె అరవిందారెడ్డి రైతుబంధు, పీఎం కిసాన్ యోజన కింద రూ.11,08,575ల డబ్బులు తీసుకొని ప్రభుత్వాన్ని మోసం చేశాడని ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ జరిపి, అతడి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని రద్దు చేయాలని కోరుతూ ఇటీవల కలెక్టర్, రెవెన్యూ ప్రిన్సిపల్, రాచకొండ సీపీ, తహసీల్దార్‌కు వేర్వేరుగా వినతిపత్రాన్ని అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏలే భిక్షపతి, చింతకింది రమేశ్, శశికళ తదితరులు ఉన్నారు.

ఓర్వలేకనే ఫోన్ ట్రాప్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఎస్పీ నాయకులు

భువనగిరిటౌన్ : రాష్ట్రంలో బీఎస్పీకి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని రాష్ట్ర ప్రభుత్వం.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌ను ట్రాప్ చేశారని ఆ పార్టీ భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు రవివర్ధన్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై శుక్రవారం భువనగిరిలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఎస్పీ ఎదుగుదలను ఎవ్వరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాసాని మహేందర్, అనిల్‌కుమార్, రమచంద్రయ్య, దాసు, సంతోష్, సరిత, కృష్ణ, నవీ, జహంగీర్, రజిత పాల్గొన్నారు.

పట్టణంలో భూ కబ్జాలను అరికట్టాలి

- మంత్రులకు విన్నవించిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలకు విన్నవించినట్లు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వందల కోట్ల రూపాయల మున్సిపాలిటీ భూములు అన్యక్రాంతం అవుతున్నాయని వాటిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మంత్రలకు వివరించినట్లు ఆయన తెలిపారు. మఠంపల్లి మండలంలో వందల కోట్ల విలువైన 46ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకోవడానికి ఏమి ఇబ్బంది అని మంత్రులను, అధికారులను అడిగితే వాపస్ తీసుకుంటామని చెప్పారని తెలిపారు. లిస్ట్ ఆఫ్ ల్యాండ్‌ను తయారు చేయాలని ఆదేశించి దానిని నోటీస్ బోర్డుపై పెట్టాలని ఆదేశించారని ఆయన అన్నారు. ఆరు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ కంప్యూటర్ లాగిన్ దొంగలించిన విషయంపై మంత్రులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ ప్రాంతంలో అన్ని లిఫ్టులు నా హయాంలోనే నిర్మాణాలు జరిగాయని తెలిపారు. హుజూర్‌నగర్‌లో 50వేల ఓట్ల మెజార్టీతో ఈ సారి మేమే గెలువబోతున్నామని, ఇందులో ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లిఖార్జున్, యరగాని నాగన్న, సాముల శివారెడ్డి, భూక్యా గోపాల్, ఎండీ నిజాముద్దీన్, అరుణ్‌కుమార్, అల్లం ప్రభాకర్‌రెడ్డి, మోతీలాల్, కొట్టె సైదేశ్వరరావు, అజీజ్ పాషా, మహేష్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు

- కోదాడ అనురాగ్ కళాశాల మొదటి స్థానం, నాగార్జునసాగర్ ద్వితీయ స్థానం



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. ఈ క్రీడల్లో కోదాడ అనురాగ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలువగా నాగార్జునసాగర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కబడ్డీ బాలికల విభాగంలో కిట్స్ కోదాడ విజేతగా నిలువగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో జీపీటీ నాగార్జునసాగర్ టీమ్ విజేత కాగా, జీపీటీ నల్లగొండ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ బాలికల విభాగంలో జీపీడబ్ల్యూ సూర్యాపేట టీమ్ విజేతగా, కిట్స్ కోదాడ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల కోదాడ విజేతగా, జీపీటీ నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. ఖోఖో బాలికల విభాగంలో జీపీడబ్ల్యూ విజేత కాగా, జీపీటీ నల్లగొండ రన్నర్‌గా నిలిచింది. ఖోఖో బాలుర విభాగంలో జీపీటీ నల్లగొండ విజేతగా నిలువగా, జీపీటీ నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. చెస్ బాలికల విభాగంలో కిట్స్ కోదాడ విజేతకాగా, జీపీడబ్ల్యూ సూర్యాపేట రన్నర్‌గా నిలిచింది. చెస్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలువగా, జీపీటీ రన్నర్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగల్ బాలికల, బాలుర విభాగంలో విజేతగా అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల, రన్నర్‌గా నాగార్జునసాగర్ కళాశాల నిలిచింది. టేబుల్ టెన్నిస్ బాలుర, బాలికల విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలువగా, రన్నర్‌గా జీపీడబ్ల్యూ సూర్యాపేట, జీపీటీ తిరుమలగిరి నిలిచాయి. బ్యాడ్మింటన్ సింగల్ బాలికల విభాగంలో జీపీటీ నల్లగొండ విజేత కాగా, నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ సింగిల్ బాలుర విభాగంలో నాగార్జునసాగర్ విజేతగా నిలువగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ డబుల్ బాలికల విభాగంలో జీపీటీ నల్లగొండ విజేతకాగా, అనురాగ్ కళాశాల రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ డబుల్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



బాణావత్ కళ్యాణ్ మృతదేహం

డిండి : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని దేవత్‌పల్లితండాకు చెందిన బాణావత్ కళ్యాణ్(36)కు మండలంలోని పద్దతండాకు చెందిన దేవితో 17ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి కళ్యాణ్ గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 4ఏళ్లుగా దంపతుల మధ్య జరుగుతున్న కుటుంబ కలహాలతో కళ్యాణ్ గ్రామంలో ఉంటుండగా దేవి హైదరాబాద్‌లో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3న దేవి తల్లీగారి గ్రామమైన పెద్దతండాకు వచ్చింది. కాగా అదే రోజు రాత్రి కళ్యాణ్‌ను పెద్దతండాకు రావాలని దేవి కుటుంబ సభ్యులు కోరడంతో అతడు అక్కడికి చేరుకున్నాడు. ఈ క్రమంలో 4వ తేదీ తెల్లవారుజామున కళ్యాణ్ నిద్ర నుంచి లేవడంలేదని దేవితో పాటు ఆమె తల్లిదండ్రులు కళ్యాణ్ సోదరులుకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకొని 108లో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే కళ్యాణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కళ్యాణ్ అనుమానస్పదంగా మృతి చెందాడని మృతుడి సోదరుడు దూబ్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కత్రావత్ భద్యా, కత్రావత్ నారి, కాత్రావత్ భాస్కర్, స్వామి, చిన్నాతో పాటు మృతుడి భార్య దేవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.సురేష్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 24లీటర్ల నాటుసారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం



పట్టుబడిన నిందితులు, సారాతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పడమటితండా, దుగ్యాల గ్రామాల్లో శుక్రవారం నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500లీటర్ల పానకం, 24లీటర్ల నాటు సారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీశంభు ప్రసాద్, ఏఈఎస్ కిషన్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుగ్యాల, పడమటితండాలో దాడులు నిర్వహిస్తుండగా పడమటితండాకు చెందిన రమావత్ వెంకటేష్, కమిలియాలు ద్విచక్రవాహనంపై నాటుసారాను తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో సారా స్థావరాలపై దాడులు నిర్వహించగా 1500లీటర్ల పానకం, 24లీటర్ల నాటుసారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా 1500లీటర్ల పానకం డ్రమ్ములను ధ్వంసం చేసి, 24లీటర్ల సారా, 84కిలోల , 60కేజీల నల్లబెల్లం, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో సీఐలు భరత్‌భూషన్, రాఘవీణ, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, పాగరాజు, ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట సేవా పురస్కారానికి వెంకటాచారి ఎంపిక



వెంకటాచారి

రాజాపేట : మండలంలోని రఘునాథపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గడగోజు వెంకటాచారి సేవలను గుర్తించిన పుడమి సాహితీ వేదిక శుక్రవారం విశిష్ట సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. సాహితీ వేదిక తెలుగు తేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని ఈనెల 8వ తేదీన నిర్వహించే సంస్థ 4వ వార్షికోత్సవంలో ఆ సంస్థ అధ్యక్షుడు చిలుగుల బాల్‌రెడ్డి అందించనున్నారు.

వైఎస్సార్‌టీపీ కార్యాచరణ కమిటీ సభ్యుడిగా పిట్టా రాంరెడ్డి



పిట్టా రాంరెడ్డి

చివ్వెంల (సూర్యాపేట) : వైఎస్సార్‌టీపీ కార్యాచరణ కమిటీ సభ్యుడిగా పిట్టా రాంరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపకురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆయన రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఎంపిక చేసినందుకు అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా, మండల నాయకులు అభినందనలు తెలిపారు.